క్లుప్తంగా

అనిల్‌కు డాక్టరేట్



తొర్రూరు రూరల్: మండలంలోని సోమారం గ్రామానికి చెందిన గద్దల అనిల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టరేట్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ గంటా చక్రపాణి చేతుల మీదుగా అందుకున్నారు.

జగ్గుతండా వాసికి..

బయ్యారం: మండలంలోని జగ్గుతండాకు చెందిన బానోత్ రమేశ్ వ్యాయామ విద్యలో తమిళనాడు రాష్ట్రంలోని అన్నామలై యూనివర్సిటీ నుంచి ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగంలో డాక్టరేట్ పొందారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయులంతా భాగస్వాములు కావాలని ఎంఈఓ ఆంగోత్ లక్ష్మానాయక్ కోరారు. ఇటీవల విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో సర్వీస్ బుక్‌లలో వివరాలు నమోదు చేయించి, ఎంఈఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వివేక్, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శి అబ్దుల్ అజీజ్, శివప్రసాద్, లక్ష్మిప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

మహబూబాబాద్ రూరల్: తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఎల్బీజీ నగర్ కాలనీ ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలుడు చదువుకోవడం ఇష్టంలేక, ఇంట్లో చెప్పకుండా పారిపోవడానికి రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. బాలుడు రైలు ఎక్కి కూర్చుని కంగారు పడుతుండగా రైలులోని ఒక ప్రయాణికుడు డయల్ 100 నంబరుకు కాల్ చేసి మహబూబాబాద్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు భజన్ లాల్, శంకర్ కాజీపేట రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. ప్రయాణికుడు బాలుడిని కాజీపేట రైల్వే పోలీసులకు అప్పగించాక వెంటనే బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు బాలుడి తల్లితండ్రుల వివరాలు, ఫోన్ నంబర్ తెలుసుకుని వారికి విషయాన్ని తెలియజేశారు. వెంటనే బాలుడి తల్లితండ్రులకు అప్పగించారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి



చిన్నగూడూరు: కేసీఆర్ పదేళ్ల పాలనలోనే తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉగ్గంపల్లిలోని తన స్వగృహంలో దంతాలపల్లి మండలం వేములపల్లి గ్రామానికి చెందిన గుమ్మడవెల్లి మహేందర్, మహేష్, శ్రీకాంత్, చరణ్, శ్రీకాంత్, మనోజ్ పలువురు కాంగ్రెస్ నాయకులు రెడ్యా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు యాకయ్య, ప్రవీణ్, గణేష్, విజయ్, నవీన్, మనోజ్ ఉన్నారు.

సుదర్శన యజ్ఞం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో సుదర్శన యజ్ఞం పూజా కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ముదుంబై లక్ష్మీనారాయణచార్యులు, సత్యంగౌతంశర్మ, రమణ, దత్తు తదితరులు భక్తుల గోత్రనామాలపై సుదర్శన భగవానుడి సన్నిధిలో పూజలు చేశారు.

ఎస్పీని కలిసిన సీఐ, ఎస్సైలు

మహబూబాబాద్ రూరల్: ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను నూతనంగా ఏర్పాటైన కేసముద్రం పోలీసు సర్కిల్ స్టేషన్ సీఐగా నియామకమైన వై.సత్యనారాయణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేసముద్రం ఎస్సైగా విధుల్లో చేరిన క్రాంతికిరణ్, ఇనుగుర్తి ఎస్సై కరుణాకర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

శంకరన్ వర్ధంతి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో విశ్రాంతి ఐఏఎస్ సీఎస్ఆర్ శంకరన్ వర్ధంతిని నిర్వహించారు. సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం శంకరన్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డోలి సత్యనారాయణ, లింగబాబు, రామయ్య, శ్రీనివాసు, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

గూడూరు: శంకరన్ నిబద్ధతకు నిలువెత్తు సంతకమని సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య అన్నారు. మండల కేంద్రంలోని టీడబ్ల్యూ బాలుర ఏహెచ్ఎస్‌లోశంకరన్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వెంకన్న, బాలయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, సురేందర్ పాల్గొన్నారు.

వైకుంఠధామంలో అసౌకర్యాలు

- దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు
- నీటి సౌకర్యం కరువు



వైకుంఠధామంలో పెరిగిన తుమ్మ చెట్లు

కురవి: చివరి మజిలీ ప్రదేశంలో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. కురవి మండల కేంద్రంలోని వైకుంఠధామం అసౌకర్యాలకు నిలయంగా మారింది. ఎవరైనా చనిపోతే దహనం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దహనం చేసేందుకు నిర్మించిన ప్లాట్‌ఫాంల పక్కన, ఖననం చేసేందుకు ఉన్న స్థలంలో పిచ్చి మొక్కలు, సర్కార్ తుమ్మ చెట్లు దట్టంగా పెరిగి ఉండడంతో అంత్యక్రియలు చేసే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖననం చేసిన గుంత చుట్టు ప్రదక్షిణలు చేయాలంటే తుమ్మ చెట్లు తగలడంతో తిప్పలు పడుతున్నారు. నడిచే పరిస్థితి కనిపించడంలేదు. గుంత తీసేందుకు వెళ్లిన వ్యక్తులు తుమ్మ చెట్లను, పిచ్చి మొక్కలను సరిచేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే దహనం చేసేందుకు నిర్మించిన గద్దెల పక్కన చెట్లను తీసివేయాల్సి ఉంది. అంత్యక్రియల కోసం కుండలో నీళ్లు తెచ్చేందుకు దూరం వెళ్లి తెచ్చుకుంటున్నారు. అంత్యక్రియల అనంతరం నీటి సౌకర్యాలు లేకపోవడంతో పక్కనే ఉన్న పశువుల సంతలోకి వెళ్లి స్నానాలు చేయడం తప్పడంలేదు. స్నానాలు చేసేందుకు నిర్మించిన షెడ్లలో నీటి సౌకర్యాలు లేవు. వైకుంఠధామంలో ఉండే బోర్ చెడిపోవడంతో దాన్ని మరమ్మతులు చేసి నీటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. అధికారులు స్పందించి వైకుంఠధామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి చివరి మజిలీకి తిప్పలు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆ దిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. లేకుంటే వచ్చే ఎన్నికల్లో అదో సమస్యగా మారే పరిస్థితి ఉంది.

కాంగ్రెస్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలి



మహబూబాబాద్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



గార్ల: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

గార్ల : రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పిలుపునిచ్చారు. మంగళవారం గార్లలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, ఎండి ఖదీర్‌బాబా, ఎం భాస్కర్‌రావు, ధరావత్ సక్రు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

మహబూబాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడే వారికే పార్టీ టికెట్లు ఇస్తుందని, స్థానిక ఎన్నికలలో సత్తాచాటాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పేరుతో ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాయిని రంజిత్‌రెడ్డి, గద్దె రవి, అశోక్, తేళ్ల శ్రీను, చిట్యాల జనార్దన్, సుదగాని మురళీ, తదితరులు పాల్గొన్నారు.

బాకీ కార్డులతో ప్రచారానికి వెళ్లాలి

తొర్రూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు బాకీ కార్డులతోనే ప్రచారానికి వెళ్లాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు కోరారు. మంగళవారం మండలంలోని అమ్మాపురం, మాటేడు, పత్తేపురం గ్రామాల్లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మంగళపల్లి శ్రీనివాస్, నలమాల ప్రమోద్ గౌడ్, హనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్‌గౌడ్, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు, జనార్దన్‌రాజు, తమ్మెర వీరభద్రారావు పాల్గొన్నారు.

పెద్దవంగర: బీఆర్ఎస్ పాలనలో రైతులు సంక్షేమంగా ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసగించిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కొరిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆరుట్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాం సంజయ్, సుధీర్ కనుకుంట్ల వెంకన్న, జ్ఞానేశ్వర చారి, గాజుల శోభప్రసాద్, భీమానాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్‌లో అన్యాయం

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సోమయ్య



మాట్లాడుతున్న సూర్నపు సోమయ్య

నెహ్రూసెంటర్: జిల్లాలో ఎంపీటీసీ స్థానాల్లోని రిజర్వేషన్‌ల్లో ఎస్సీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఎన్నికల అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగానే రిజర్వేషన్‌లో తప్పిదాలు జరిగాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్‌లలో జరిగిన తప్పులను సవరించి దళితులకు, బీసీలకు సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని డోర్నకల్, కురవి, మహబూబాబాద్, మరిపెడ, నర్సింహులపేట మండలాల్లో ఎస్సీల ఎంపీటీసీ స్థానాల సంఖ్య పెంచి ఇవ్వాలన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియపై అధికారులు విచారణ చేపట్టిన నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రాజన్న, రాజు, వీరయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

గూడూరు: పోషకాహారంతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవంలో భాగంగా చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్స్‌ను చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బండోజు వేణుచారీ, హెచ్ఎం సంపత్‌రెడ్డి, రవీందర్, వినోద్‌రాజ్, రమణ పాల్గొన్నారు.

కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి

మరిపెడ రూరల్: గ్రామాలలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీ చాంబర్‌లో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి అన్ని గ్రామాల కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని 48గ్రామ పంచాయతీలకు 15 ఎంపీటీసీ స్థానాలకు, జెడ్పీటీసీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఇంటి పన్ను బకాయిలు ఉండకుండా చూడాలన్నారు. ఒకవేళ ఇంటి పన్ను బకాయిలు ఉంటే వెంటనే వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో దొంతు లెనిన్, రామోజీ, ప్రణయ్, ఉమేష్‌చంద్ర, రవి, తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించండి



నెహ్రూసెంటర్: నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



తొర్రూరు: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

నెహ్రూసెంటర్: దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. సీజేఐపై దాడిని ఖండిస్తూ సీపీఐ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో అజయ్‌సారథిరెడ్డి, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు. న్యాయమూర్తి గవాయ్‌పై దాడి నిరసిస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని ఖండించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు.

కురవి: న్యాయమూర్తిపై దాడి చేయడాన్ని ప్రజాస్వామికవాదులు ఖండించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

గార్ల: జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన మతోన్మాద లాయర్‌ను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకుడు గిన్నారపు మురళీ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎడ్ల రాజేందర్, మొగిలి వెంకన్న, బాదం రాజేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి సిగ్గు చేటు

తొర్రూరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి సిగ్గు చేటని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఘనపురం రామకృష్ణ అన్నారు. దాడిని ఖండిస్తూ తొర్రూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మైలపాక అశోక్, మాదగాని నాగరాజు, ప్రవీణ్‌రాజు, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

చిన్నగూడూరు: సీజేపై దాడి చేసిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గునిగంటి మోహన్ డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ మంగళవారం మండలంలోని గుండంరాజుపల్లి జీపీ ఆవరణలో సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో దాడి చేసిన నిందితుల దిష్టి బొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో కందుకూరి సుధాకర్, వీరయ్య, వీరన్న, లింగన్న, వీరమల్లు, శ్రీను పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



మహబూబాబాద్ రూరల్: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు



మహబూబాబాద్: మున్సిపాలిటీ కార్యాలయంలో..

మహబూబాబాద్ రూరల్: మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి మంగళవారం పోలీసు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, డీసీఆర్బీ డీఎస్పీ గండ్రతి మోహన్, కేసముద్రం సీఐ సత్యనారాయణ, డీపీఓ సీఐ శంకర్ నాయక్, ఆర్ఐలు భాస్కర్, సోములు, నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్: మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం రామాయణ మహాకావ్య రచయిత వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆర్వో రఘు, ఏఈ కుమార్, టీపీఎస్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కొమురం భీంకు ఘన నివాళి



మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గార్ల: కొమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న, ఆదివాసీ సంఘాల నాయకులు



గూడూరు: టీడబ్ల్యూ ఏహెచ్ఎస్ పాఠశాలలో..



బయ్యారంలో..

కొమురం భీం వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: ప్రేమికుల పంచాయతీ విషయంలో తండ్రి, కొడుకులపై దాడిచేసిన వ్యక్తులపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రజాలిపేటకు చెందిన బానోత్ అభిరామ్ ఒక అమ్మాయిని ప్రేమించి తీసుకువచ్చాడన్నారు. ఈ విషయమై పెద్ద మనుషుల సమక్షంలో పట్టణంలోని ఓ ప్రాంతంలో మాట్లాడుతుండగా అబ్బాయి స్నేహితులైన మానుకోట పట్టణంలోని గుండ్లకుంట కాలానికి చెందిన వంశీ, సాయిగణేష్, మహేష్, మరికొద్దిమంది వ్యక్తులు అక్కడకు వచ్చి ఘర్షణకు దిగారని తెలిపారు. ఈ క్రమంలో అమ్మాయి తరుపు బంధువులు జర్పుల వాలు, అతని కొడుకుపై ఆ యువకులు దాడి చేయగా వారికి తీవ్రగాయాలయ్యాయని పేర్కొన్నారు. తమపై దాడిచేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్య తీసుకోవాలని కేసముద్రం మండలం భవానీగడ్డ తండాకు చెందిన బాధితుడు జర్పుల వాలు ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

దంతాలపల్లి: మండలంలోని తూర్పుతండాలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడిన సంఘటన చోటు చేసుకుంది. బాధితుడు గుగులోత్ శివ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం శివ ఇంటికి తాళం వేసి తన అత్తగారు గ్రామమైన మరిపెడ బంగ్లా వెళ్లాడు. మంగళవారం శివ ఇంటికి వచ్చేసరికి తన ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా రూ.50వేల నగదు, విలువైన వస్తువులు పోయినట్లు గుర్తించాడు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

సంక్షిప్త సమాచారం

ఆర్‌యూబీ రెయిలింగ్ కూల్చివేత

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్‌యూబీ రెయిలింగ్‌ను(రైల్వే అండర్ బ్రిడ్జి)సోమవారం రాత్రి కొంత మేరకు కూల్చివేశారు. జిల్లా ప్రధాన వైద్యశాల వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి రెయిలింగ్ కూల్చివేశారు. ఆ ప్రాంతంలోని పలువురు ఆ కూల్చివేతపై మున్సిపల్ అధికారులకు ఫోన్ చేయగా తమకు సంబంధం లేదని తెలిపినట్లు వారు తెలిపారు.ఈ విషయంలో పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టనున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలో మరో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం టౌన్ శాఖ కార్యదర్శి జల్లే జయరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి సబ్ పోస్టాఫీసు ఎదుట నిరసన తెలిపారు. కేవలం ఉప తపాల కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోమారపు ఎల్లయ్య, వీరన్న, ప్రేమ్‌కుమార్, లకావత్ వీరన్న, వెంకన్న పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి నీటి సరఫరా బంద్

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బాల్నిధర్మారం గ్రామంలో నీటి సరఫరా పైపు లైన్ ఇటీవల పగిలిపోయాయి. దీంతో గ్రామస్తులకు మూడు రోజులుగా సురక్షిత నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక సుదూర ప్రాంతాల నుంచి నీటిని తోడుకొచ్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

దంతాలపల్లి: మండల కేంద్రానికి చెందిన బండారి మహేష్ సెల్‌ఫోన్‌ను ఆగస్టులో పోగుట్టుకున్నాడు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సెల్‌ఫోన్ కనుగొన్న ఎస్సై రాజు మంగళవారం బాధితుడికి అప్పగించాడు.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ పోటీ

బయ్యారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు పోటీలో ఉంటారని పార్టీ ఇల్లెందు నియోజకవర్గ కన్వీనర్ వంశీ, మండల అధ్యక్షుడు వడ్లమూడి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి మోదుగుల శ్రీహరి, నాయకులు బాబురావు, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు పల్టీ..

గూడూరు: జాతీయ రహదారిపై గుంతలు ఉండడంతో అతివేగంగా వస్తున్న కారు ప్రమాదవశాత్తు పల్టీకొట్టి కిందపడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొద్దుగొండ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. కారులో నలుగురు ఉన్నారు. 108 వాహనంలో మానుకోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వారు భూపాలపల్లి వాసులని తెలిసింది.

ఎన్నికలను బహిష్కరిస్తాం..

గంగారం: రిజర్వేషన్లు గందరగోళంగా ఉండడంతో స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని పెద్దాలాపురం గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. తక్షణమే జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి, లేదంటే ఎన్నికలనే బహిష్కరిస్తామని తేల్చి చెప్పారు.

ఎనిమిది కాళ్ల గొర్రెపిల్ల జననం



కేసముద్రం: ఎనిమిది కాళ్ల వింత గొర్రెపిల్ల జన్మించిన సంఘటన మండలంలోని ఇంటికన్నె గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెలగొల్ల కట్టయ్య ఎప్పటిలాగే తన గొర్రెలను మేపేందుకు ఊరిబయటకు తొలుకెళ్లాడు. ఈ క్రమంలో గొర్రెల మందలో ఓ గొర్రెకు 8కాళ్ల గొర్రె పిల్ల జన్మించింది. జన్యుపరమైన లోపంతో ఒక్కోసారి ఇలాంటి పిల్లలు జన్మించడం సహజమని పశువైద్యాధికారి తెలిపారు. పుట్టిన కొద్ది సేపటికే గొర్రెపిల్ల మృతి చెందింది.

పట్టుదలతో చదవాలి

చిన్నగూడూరు: క్రమశిక్షణ, పట్టుదలతో చదివిన విద్యార్థులే సమాజంలో ఆదర్శ పౌరులుగా నిలుస్తారని జెడ్పీహెచ్ఎస్ జయ్యారం పాఠశాల హెచ్ఎం ఉషశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని జయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులలో పొదుపు అలవాటు ఆర్థిక సాక్షరత, లెక్కల పరమైన అంశాలపై మోడల్ బ్యాంకింగ్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులే బ్యాంకింగ్ మేనేజర్, క్యాషియర్, బ్యాంక్ సిబ్బందిగా విధులు నిర్వహించారు.

డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘం జేఏసీ కన్వీనర్ కుర్ర మహేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏటీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమ్మె మంగళవారం నాటికి 26వ రోజుకు చేరింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దంతాలపల్లి: స్థానిక ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పిల్లల రాజు అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఉరి వేసుకొని యువతి మృతి

గార్ల: మానసిక స్థితి సక్రమంగా లేక ఓ యువతి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం జీవంజిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల గ్రామ పంచాయతీ జీవంజిపల్లికి చెందిన బి.అనూష(26)కు కొంతకాలంగా మానసిక స్థితి సక్రమంగా లేదు. తల్లి ఉమ బియ్యం కోసం రేషన్‌షాపునకు వెళ్లింది. రేషన్ షాపు నుంచి తల్లి వచ్చే సరికి కూతురు ఉరి వేసుకొని ఉంది. తల్లి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి హుటాహుటిన గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి, అనూష అప్పటికే చనిపోయిందని తెలిపారు.

పరామర్శ..

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన చిలుముల భిక్షపతి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించాడు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు. కార్యక్రమంలో నాయకులు చెన్నారెడ్డి, కృష్ణారెడ్డి, ఉపేందర్ రెడ్డి ఉన్నారు.

సీపీఎంను ఆదరించాలి

డోర్నకల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎంను ఆదరించాలని పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ కోరారు. మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామంలో మంగళవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బొబ్బ వెంకటరెడ్డి, శెట్టి వెంకన్న, బొమ్మన అశోక్‌కుమార్, ఉప్పనపల్లి శ్రీనివాస్, జాగర్లమూడి శ్రీధర్ పాల్గొన్నారు.

సీపీఐని ఆదరించాలి

కురవి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీని ఆదరించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో తురక రమేశ్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో మండల కార్యదర్శి కరణం రాజన్న, దొంతు రామ్మూర్తి, బుడమ వెంకన్న, రామగోని రవి, దూదికట్ల సారయ్య, కలగూర నాగరాజు, బొల్లు వెంకన్న పాల్గొన్నారు.